

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఏప్రిల్ 19 : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకూ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీలకు రూ. 250, ఇతరులకు రూ.500 చెల్లించి పాలిసెట్.ఎస్‌బీటెట్, తెలంగాణ, జీవోవి.ఐఎన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అనూహ్య వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం భానుడు భగభగమంటుంటే.. సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాల్లో పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పిడుగులు పడి ఓ వ్యక్తి మృతి చెందగా, తాటి, కొబ్బరి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

- ధర్మసాగర్‌లో ఏడెకరాల్లో బొప్పాయి పంటకు నష్టం
- వికారాబాద్‌లో దెబ్బతిన్న జొన్న పంట
- మేడ్చల్,మహేశ్వరంలో విరిగిన చెట్లు.. ట్రాఫిక్ జామ్
- మహేశ్వరంలో పిడుగుపడి వ్యక్తి మృతి
- ఇబ్రహీంపట్నం, ఆదిభట్లలో చెట్లు దగ్ధం
- ఆమనగల్లులో విద్యుత్ వైర్లు తెగి అంధకారం

ఉదయం సాయంత్రం

ఎండ... వాన!



కందుకూరు : తిమ్మాపూర్ గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

ఉమ్మడి జిల్లాలో విభిన్న వాతావరణ స్థితి

పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/వికారాబాద్/కులకచర్ల /మేడ్చల్ టౌన్/చేవెళ్ల/యాచారం/కందుకూరు/షాద్‌నగర్/చౌదరిగూడ /ఆదిభట్ల/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/మహేశ్వరం, ఏప్రిల్ 19: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండుతుండుంటే మరో వైపు ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వికారాబాద్ మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షాలు పడడంతో పంటలు నేలకొరిగాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం రాచలూరులో 20మి.మీ వర్షాపాతం నమోదు కాగా కందుకూరులో 19.5మి.మీ, మంచాలలో 9మి.మీ వర్షం కురిసింది. కందుకూరు మండలంలోని పరిధిలోని తిమ్మాపూర్, మాదాపూర్, గుమ్మడవల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట్, కందుకూర్, మహమ్మద్‌నగర్, కొత్తగూడ, తదితర గ్రామాల్లో శుక్రవారం భారీవర్షం కురిసింది. అనేక చోట్ల పంట నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఈదురుగాలులతో వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద ఉండకూడదన్నారు. మరోవైపు అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతోంది. మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా కోట్‌పల్లిలో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రంగారెడ్డిజిల్లా సరూర్‌నగర్ అల్కాపురి కాలనీలో అత్యధికంగా 42.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా యాలాలలో 41.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దెబ్బతిన్న పంటలు

చేవెళ్ల మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన గుర్రాల బల్వంత్‌రెడ్డి తనకున్న పది ఎకరాలకు గాను..7 ఎకరాల్లో ఈ యేడాది బొప్పాయి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. గురువారం రాత్రి భారీగా ఈదురుగాలులు, వర్షం కురియడంతో బొప్పాయి పంట పూర్తిగా నేలకొరిగింది. కాయలన్నీ నేలరాలిపోయాయి. పంటను మార్కెట్‌కు తరలించే సమయంలో బొప్పాయి పంట



మేడ్చల్‌లో కురుస్తున్న వర్షం



వికారాబాద్ మండలం పులుసుమామిడిలో నేలకొరిగిన జొన్న చేను

దెబ్బతినడంతో రైతు బోరుమంటున్నాడు. ఏడు ఎకరాల్లో బొప్పాయి పంట దెబ్బతినడంతో రూ. 6నుంచి 7లక్షల వరకు నష్టం వాటిల్లిదని రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. వికారాబాద్ మండలం పులుసు మామిడి గ్రామానికి చెందిన కేరెల్లి అంజిరెడ్డి రెండు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. కురిసిన వానకు పూర్తిగా నెలకొరిగింది. గ్రామశివారులో ఓ ఇంటి వద్ద భారీ చెట్టు విరిగిపడింది. వ్యవసాయాధికారులు గ్రామంలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కులకచర్ల మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. కులకచర్ల, ముజాహిద్‌పూర్, కామునిపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురియడంతో కోతకొచ్చిన పంటలు, ధాన్యం విక్రయించే రైతుల్లోకలవరం మొదలైంది. ఈదురుగాలులకు యాచారం మండలం చౌదర్‌పల్లి, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, యాచారం గ్రామాల్లో మామిడికాయలు, ధాన్యం రాలిపోయాయి.



తులేకలాన్‌లో పిడుగుపడి కాలిపోతున్న తాటిచెట్టు

పిడుగు పడి వ్యక్తి, కొబ్బరి, తాటి చెట్లు దగ్ధం

మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన మారమోని జంగయ్య (42) పొలం వద్ద నిలబడగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిభట్ల మున్సిపాలిటి పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో ఒకేసారి పొలంలో తాటిచెట్టుపై, వెంచర్‌లో కొబ్బరి చెట్టుపై పిడుగు పడగా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామ శివారులో పిడుగుపడి తాటిచెట్టు పూర్తిగా కాలిపోయింది. హైదరాబాదు- శ్రీశైలం ప్రధాన రహదారి తుమ్మలూరు పెద్దమ్మగుడి సమీపంలో భారీ చెట్టు కూలి రోడ్డుపై పడడంతో మూడు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. పెట్రోలింగ్ పోలీసులు రోడ్డుపై పడిన చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అలాగే ఆమనగల్లులో మూడు గంటల పాటు భారీ వర్షం కురియడంతో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలో అంధకారం నెలకొంది.



తుమ్మలూరు పెద్దమ్మగుడి వద్ద కూలిన చెట్లు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో దాదాపు గంట పాటు కురిసిన వర్షంతో జనజీవనం అతలాకుతలమైంది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగల పై పడటంతో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. వర్షం కారణంగా జాతీయ రహదారిపై రెండు గంటల పాటు వాహనాలు స్తంభించిపోయాయి. యాచారం మండలంలోని యాచారం, మాల్, మేడిపల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, గున్‌గల్,నానక్‌నగర్, మల్కీజ్ గూడ, చౌదర్‌పల్లి తదితర గ్రామాలలో శుక్రవారం ఈదురు గాలులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది, యాచారం, మాల్, నందివనపర్తి, గున్‌గల్ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. షాద్‌నగర్ పట్టణంలో ఉరుములు మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసింది. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల్లో ఉదయం భారీ వర్షం కురిసింది.



చేవెళ్ల : ధర్మసాగర్ గ్రామంలో నేలరాలిన బొప్పాయి తోటను చూపిస్తున్న రైతు బల్వంత్‌రెడ్డి

అభ్యర్థుల ఖర్చులు నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోజ్‌లక్రా, ధృవ్‌భోళ



మాట్లాడుతున్న జిల్లా వ్యయ పరిశీలకులు

మేడ్చల్ ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికలప్రక్రియ ముగిసే వరకు ఎన్నికలవ్యయ పరిశీలన బృందాలు అభ్యర్థుల ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోజ్‌అలోయిస్ లక్రా, ధృవ్‌భోళాలు అన్నారు. శుక్రవారం వ్యయ పరిశీలకులు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు, వీడియోసర్వే లెన్సు బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్‌బృందాలు, షాడో టీమ్‌లతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని, ఇన్‌కమ్ టాక్స్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా రోజువారీ దినపత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టిసారించాలని, సోషల్ మీడియా పై పటిష్ట నిఘా ఉండాలన్నారు. సువిధ పోర్టల్‌లో నమోదు పై రాజకీయ పార్టీల వారికి అవగాహన కల్పించామని, జిల్లాలో చెక్‌పోస్టుల ద్వారా నిఘా పెట్టి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని బృందాల సభ్యులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లు స్వాధీనం

నవాబుపేట, ఏప్రిల్ 19: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం నవాబుపేటలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.1.5కోట్లు పట్టుకున్నారు. పులుమామిడి గేటు సమీపంలో టీఎస్ 19 ఈక్యూ 0004 నెంబర్ గల కారులో రూ.1 కోటి 5 లక్షలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ. 50వేలకు మించి తీసుకెళ్లొద్దని సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 19 : అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టవలసిన పనులు గ్రౌండ్ చేసి పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఈవో, ఎంపీడీవో, ఏఈలుతో టెలీకాన్ఫరెన్సులో మాట్లాడారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ. లక్ష వరకు ఉన్న నిర్మాణ పనులు రెండు రోజుల్లో గ్రౌండ్ చేసి ప్రారంభించాలన్నారు. అన్ని మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కాంపౌండ్‌వాల్, మరుగుదొడ్లు , ఇతర సదుపాయాలపై పర్యవేక్షించాలన్నారు. డీఈవో రేణుకాదేవి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ తదితరులు ఉన్నారు. అంతేకాకుండా జిల్లాలోని స్పెషల్ అధికారులు, కార్యదర్శులు ప్రతి గ్రామాన్ని తప్పని సరిగా పర్యవేక్షించి గ్రామ సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసి రిపోర్టు ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. గ్రామస్థాయిలో పరిపాలన పరంగా పనులు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల లక్ష్యం చేరుకోవాలని అన్నారు.

మట్టిలో మాణిక్యాలు

మట్టిలో మాణిక్యాలు అనడానికి వికారాబాద్ జిల్లా నుంచి సివిల్ సర్వీసెస్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన మారుమూల గ్రామాల విద్యార్థులే నిదర్శనమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన మహ్మద్ ఆస్ఫాక్(770)ని వీడీడీఎస్, ఎస్‌ఎస్‌పీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరి తల్లిదండ్రులకు, సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శుభప్రద్‌పటేల్, శ్రీనివాస్, మారుతి, తిరుపతిరెడ్డి, ఫకృద్దీన్, మాణిక్‌రెడ్డి, కేదార్‌నాథ్, సుజిత్‌మరంలా, ఆస్ఫాక్ తల్లిదండ్రులు మహమ్మద్ జాఫర్, రిజ్వాన్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



ఐఏఎస్‌కు ఎంపికైన అస్ఫాక్‌ను సన్మానిస్తున్న నారాయణరెడ్డి

పేరుకుపోతున్నాయ్

- తాండూరులో అస్తవ్యస్తంగా డంపింగ్‌యార్డు నిర్వహణ
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తాండూరు, ఏప్రిల్ 19: తాండూరులో డంపింగ్‌యార్డు నిండిపోయింది. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడిచెత్త అక్కడే ఉండడంతో యార్డులోకి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తాండూరు మున్సిపాలిటీకి సంబంధించి డంపింగ్ యార్డును పెద్దేముల్ వెళ్లే మార్గంలో అంతారంగుట్ట సమీపంలో ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు రోజుకు దాదాపు 40 మెట్రిక్ టన్నులను తరలిస్తున్నారు. వ్యర్థాలుగా గుట్టలుగా పేరుకు పోయి అందులోంచి పొగలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుతం యార్డు నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో చెత్త వాహనాలు కూడా యార్డులోని వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముక్కుపుటలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య సిబ్బంది ముక్కుమూసుకుని వెళ్లే దుస్థితి నెలకొంది. నిర్వహణ విషయంలో ప్రత్యేకంగా అధికారులు దృష్టి సారించకపోవడంతో ఫస్ట్ ఫ్లాట్, సెకండ్ ఫ్లాట్, అంతా వ్యర్థాలతో నిండిపోయింది. మున్సిపాలిటీకి చెందిన ఎక్స్‌కవేటర్ ఉన్నా చెత్తను తొలగించకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను చదును చేయించాలని పారిశుధ్య సిబ్బంది కోరుతున్నారు.



డంపింగ్ యార్డు సీసీ రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

8 నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానాలకు రెండో రోజు అభ్యర్థులు 8 నామినేషన్లు దాఖలు చేశారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి శుక్రవారం 5 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. స్వతంత్ర్య అభ్యర్థులుగా ఓరుగంటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సాయి వరప్రసాద్, రాజేష్ మిశ్రా శివ్, చలిక చంద్రశేఖర్‌లు ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయగా, కుడుపూడి వీవీఎస్ నారాయణ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. చేవెళ్ల పార్లమెంటు స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యు) పార్టీ అభ్యర్థి వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థి మహ్మద్ చాంద్‌పాషా, భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున ప్రతిపాదకులు మేకల బిక్షపతి నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి శశాంకకు సమర్పించారు. కాగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మరో దఫాలో ఈనెల 22న రెండో సెట్ నామినేషన్ వేయనున్నారు. అలాగే ఈనెల 25న పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు ర్యాలీతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రెండు సెట్ల నామినేషన్ వేసేందుకు కాసాని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 19: మండలంలోని గోవిందాపూర్ పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌ఖాన్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ పంచాయతీలో ఫేరోజ్‌ఖాన్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ జరిపారు. దీంతో అధికారుల విచారణ అనంతరం నివేదికను కలెక్టర్ సి.నారాయణరెడ్డికి అందించడంతో పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌ఖాన్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత 15 రోజుల నుంచి గ్రామపంచాయతీ విధులకు హాజరు కాకపోవడం, మార్చి 27న మెమోకు ఎలాంటి సంజాయిషీ ఇవ్వకపోవడం, ఈనెల 3న ముఖ్య కార్య నిర్వాహణ అధికారి సమీక్షా సమావేశానికి హాజరు కాకపోవడం, ఈ నెల 4న ఎంపీడీవో గ్రామానికి వెళ్లిన సమయంలో లేకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్ వంటివి చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. దీంతో గ్రామస్థులు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు.


ఫేరోజ్‌ఖాన్

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 19: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లో గల గిరిజన గురుకుల పాఠశాలను వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రిన్సిపాల్ బలరాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి

దోమ, ఏప్రిల్ 19: ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా ప్రతీ గ్రామపంచాయతీకి లక్షలాది రూపాయలు ఖర్చుచేసి రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండలంలోని ఊటుపల్లి నుంచి పరిగికి వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. వాటి చుట్టూ చదును చేయించి మొక్కలు ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సివుంది. అయితే రోడ్డుపక్కనే ఉన్న పంట పొలాలను చదును చేసుకునే రైతులు పిచ్చిమొక్కలతో పాటు హరితహారం మొక్కలకు నిప్పుపెట్టేస్తున్నారు. ప్రతీ ఏడాది ఇదే తంతు కొనసాగుతోంది. సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడం, వాటి నిర్వహణ పట్టించుకోవడంతో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నాటిన మొక్కలు వృధా అవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


ఊటుపల్లి నుంచి పరిగికి వెళ్లే మార్గంలో దగ్ధమైన హరితహారం మొక్కలు

గుర్తింపు లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వికారాబాద్, ఏప్రిల్ 19: నకిలీ, లూజ్ గుర్తింపు పొందని విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అమ్మరాదని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పని సరిగా అధీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొన్న తర్వాత రసీదు పొందాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారాన్ని దగ్గరలోని వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని కోరారు.

బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజు

దోమ, ఏప్రిల్ 19: అయినాపూర్ గ్రామానికి చెందిన ఎస్.రాజు వికారాబాద్ జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం నాయకులు లాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రాజు

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు

● ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి ● ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రంజిత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, ఏప్రిల్ 19: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బషీరాబాద్ మండలంలోని మైల్వార్, ఎక్మాయి, దామర్‌చెడ్, బషీరాబాద్, నవాల్ల, గొట్టిగఖుర్దు, కాశీంపూర్, మంతట్టి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు .అంతకు ముందు నీళ్లపల్లి ఏకాంబర దేవస్థానంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాట్లాడుతూ మత రాజకీయాలను ప్రేరేపించే బీజేపీని మరోసారి నమ్మి ఓటు వేసి మోసపోవద్దన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిది దొరల కుటుంబామని, గతంలో గెలిచి ఏంచేశారో ప్రజలు గుర్తించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే జోడేడ్లలాగా ప్రజలకు సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, ఆపార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, మాజీ జడ్పీటీసీ ఎం.రాకేష్, సీనియర్ నాయకులు డాక్టర్. సంపత్‌కుమార్, ఎస్.వెంకటేష్, బుయ్యని సత్యనారాయణరెడ్డి, సోంపల్లి బిచ్చి రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ శంకర్‌రెడ్డి, రామునాయక్, శంకరప్ప పాల్గొన్నారు.

వికారాబాద్: రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి సీతా రంజిత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మరో అవకాశమివ్వండి

శంకర్‌పల్లి: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డికి ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వాలని టీటీడీ బోర్డు సభ్యురాలు, ఆయన సతీమణి సీతారెడ్డి కోరారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతిభీంభరత్‌తో కలిసి సీతా రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జడ్పీటీసీ గోవిందమ ఉన్నారు.

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


చేవెళ్ల: మాట్లాడుతున్న సీతారెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన హరిహర గౌడ్

తాండూరు: తాండూరు సీనియర్ నాయకులు హరిహరగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్ఎస్‌లో పని చేసిన ఆయన శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, తదితరులు ఉన్నారు.

నేడు తాండూరులో ప్రచారం

తాండూరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు(శనివారం) కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి నారాయణపూర్, వీరశెట్టిపల్లి, గోనూరు, చెనిగేష్‌పూర్, మధ్యాహ్నం 12గంటల నుంచి ఎల్మకన్నె, ఓగీపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, సాయంత్రం 4.30గంటల నుంచి బెల్కటూర్, పర్వతాపూర్, చింతామణిపట్నం, రాత్రి 7గంటల నుంచి చెంగోల్, గౌతాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్, బీరప్పగడ్డ వద్ద నివాసముంటున్న పర్వతం ధనంజయ(40) సరూర్‌నగర్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ధనంజయ భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఘట్‌కేసర్‌లోని బంధువుల ఇంటికి జన్మదిన వేడుకలకు వెళ్లాడు. తిరిగి గురువారం రాత్రి 11:30లకు భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఉప్పల్‌లోని ఇంటికి వస్తుండగా పోచారం మున్సిపల్, అన్నోజిగూడ డీ-మార్ట్ వద్దకు రాగానే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనంజయకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చిన్న కుమారుడికి తీవ్రగాయాలు కాగా, భార్య పెద్ద కుమారుడికి స్వల్పగాయాలు కావడంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పెద్దకుమారుడికి మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

పరిగి, ఏప్రిల్ 19: మద్యానికి బానిసై ఓవ్యక్తి మృతి చెందాడు. పరిగి మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన బేగరి జంగయ్య(48) మద్యానికి బానిసై రోజంతా మద్యం సేవిస్తుంటాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరి రాత్రి వరకూ ఇంటికి తిరిగిరాలేదు. శుక్రవారం రుకుంపల్లి శివారులో జంగయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడు జంగయ్యగా గుర్తించారు. మద్యం సేవించి తినకుండా ఎండతో తిరుగుతూ పడుకున్న స్థలంలోనే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో పీజీ విద్యార్థిని..

మహబూబ్‌నగర్/బషీరాబాద్, ఏప్రిల్ 19: ఉన్నత చదువులు చదివి ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులను ఆశ్రయించి మృతదేహాన్ని గుర్తించి తమ కూతురేనని నిర్ధారించారు. బషీర్‌బాద్ మండలం పర్వత్‌పల్లికి చెందిన తాండూర్ లక్ష్మి(26) ఎంఎస్సీ బీఈడీ చదివింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి ఉంటూ గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ఈక్రమంలో ఈనెల 17న ఊరెళుతున్నానని తనతో పాటు రూమ్‌లో ఉంటున్న స్నేహితులకు చెప్పి బయల్దేరింది. అక్కడి నుంచి నేరుగా కేసీఆర్ ఎకోపార్క్‌కు చేరుకుని ఒంటిపై గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కూతురుకు ఫోన్‌చేసినా అందుబాటులోకి లేకపోవడం, స్నేహితులను అడిగితే ఊరికే వస్తానని చెప్పి వెళ్లిందని చెప్పడంతో అనుమానం వచ్చి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. మృతదేహం, నగలు చూయించడంతో తమ కూతురేనని గుర్తించారు. ఘటనాస్థలంలో ఒక కీ ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అద్దెకు ఉంటున్నగది తాళానికి సంబంధించి ముగ్గురు స్నేహితుల వద్ద మూడు తాళం చెవులు ఉన్నాయి. పోలీసులు తమకు ఘటనాస్థలంలో లభించిన తాళం చెవితో వారి రూమ్‌తాళానికి సరిపోలడంతో మృతురాలుగా లక్ష్మిగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అయితే అమ్మాయి మరణానికి గల కారణాలు తెలియలేదు. మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తాండూరు రూరల్, ఏప్రిల్ 19: హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సుదర్శన్ తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2013లో కరన్‌కోట్ గ్రామానికి చెందిన వడ్డె శ్యామలమ్మ నివాసం ఉంటుంది. ఆమెకు వరుసకు తమ్ముడైన మంచిర్యాల లింగప్ప శ్యామలమ్మ వద్ద నుంచి తులం బంగారం, రూ.30వేల నగదును తీసుకున్నాడు. తీసుకుని రెండేళ్ల గడుస్తున్నా ఇవ్వకపోవడంతో శ్యామలమ్మ లింగప్పను బంగారం, నగదు ఇవ్వాలని కోరింది. దీంతో ఆగ్రహానికి గురైన లింగప్ప శ్యామలమ్మ ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై వడ్డె దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కరన్‌కోట్ ఎస్ఐ పి.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీటు సమర్పించారు. వాదోపవాదాలు విన్న డిస్ట్రిక్ట్ జడ్జీ కె.సుదర్శన్ శుక్రవారం నిందితుడు లింగప్పకు జీవిత ఖైదుతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

పోగొట్టుకున్న 50 సెల్‌ఫోన్లు రికవరీ

వికారాబాద్, ఏప్రిల్ 19: సీఈఐఆర్(సెంట్రల్ ఎక్యూమెంట్ ఐడెంటీ రిజిస్ట్రార్ అప్లికేషన్ ద్వారా ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా ఫోన్‌ను వెతికిపట్టుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాలో 50 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధితులకు అట్టి ఫోన్‌లను ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రికవరీ చేశారు. వికారాబాద్ డివిజన్‌లో 21, పరిగి 19, తాండూరు 10ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని చెప్పారు.

డాక్టర్ల వివాహానికి హాజరైన అసెంబ్లీ స్పీకర్

వికారాబాద్, ఏప్రిల్ 19: పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం ప్రముఖ వ్యాపారి మోముల ప్రభాకర్, మాధవిల కుమారుడు డాక్టర్ సంపత్, వనజ, బాలకృష్ణల కూతురు డాక్టర్ సుష్మ వివాహానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై ఆశీర్వదించారు.

ఆలయాలు అధ్యాత్మికతకు నిలయాలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19 : దేవాలయాలు అధ్యాత్మికతకు నిలయాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల శ్రీశివశంకరి గోశాలలో వైఎస్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాగణపతి, అమృత ఘటేశ్వరస్వామి, లలితాత్రిపుర సుందరి అమ్మవార్ల విగ్రహాలను శుక్రవారం అందజేశారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

తాండూరురూరల్: తాండూరు మండలం చిట్టిఘనాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. మూడురోజులపాటు అమ్మవారికి జలాదివాసం, ధాన్యాదివాసంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించారు. పోతురాజ విన్యాసం ఆకట్టుకుంది.

ఆలయ హుండీ లెక్కింపు

యాలాల, ఏప్రిల్ 19: శ్రీరామనవమి సందర్భంగా జుంటుపల్లి సీతారాముల కల్యాణ మహోత్సవానికి సంబంధించి హుండీని శుక్రవారం ఆలయ ప్రాంగణంలోట లెక్కించారు. నగదు రూపేన రూ.3లక్షల 14,913, ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారి బాలారాజ్, ఆలయ ధర్మకర్త హనుమంతరావు తెలిపారు. అదేవిధంగా వేలంలో టెంకాయలకు రూ.1,83,500, లడ్డులకు రూ. 1,85,500 ఇప్పటికి దేవాలయానికి ఆదాయం సమకూర్చిందని చెప్పారు.

వీరశైవ లింగాయత్ లింగ బలిజ మండల కార్యవర్గం

యాలాల, ఏప్రిల్ 19: వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడిగా యాలాలకు చెందిన బస్వరాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్ శంకర్ గౌరవ అధ్యక్షుడు మొగిలి వీరేశంలు శుక్రవారం ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా చెన్నారం ఆకుల శివకుమార్, ఉపాధ్యక్షులుగా దేవనూర్ శివకుమార్, అశోక్ కుమార్, కిష్టాపూర్ రవి, బసప్ప, ప్రధాన కార్యదర్శిగా శరణుభూపాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బస్వరాజ్, సహాయ కార్యదర్శులుగా ఏ.శంకర్, సలహాదారుడుగా ఎం.వీరేంద్ర ప్రసాద్ ఎన్నికయ్యారని తెలిపారు.

పెద్దేముల్: వీరశైవలింగాయత్ లింగబలిజ సంఘం పెద్దేముల్ మండల అధ్యక్షుడిగా కె.సంగమేశ్వర్‌ను ఎనుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పటేల్‌ఉదయ్‌శంకర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మోగిళి వీరేశం సంయుక్త పత్రికటనలో వెల్లడించారు. మండల గౌరవ అధ్యక్షులుగా బి.బస్వరాజ్, అధ్యక్షులుగా కె.సంగమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా ఏ.చంద్రశేఖర్, సందీప్‌కుమార్, డి.శాంత్‌కుమార్, సిద్దేశ్వర్, జి.ఆనంద్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా వి.రమేష్, కోశాధికారిగా బలిజరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా బలిజబస్వరాజ్, సహాయకార్యదర్శిగా విజయ్‌కుమార్, మాణిక్ పటేల్, కె.అశోక్, బి.రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బషీరాబాద్: వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం అధ్యక్షులుగా పూడూరు శ్రావణ్‌కుమార్ శుక్రవారం నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పటేల్ ఉదయ్‌శంకర్, గౌరవ అధ్యక్షులు మోగిళి వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ఉమేష్, ఉపాధ్యక్షులుగా సి.మల్లికార్జున్, డి.రాజేందర్‌కుమార్, బసంత్‌రావు, సోమ్‌శెట్టి జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

తాండూరు రూరల్, ఏప్రిల్ 19: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో శుక్రవారం పర్యటించారు. గ్రామ సమీపంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించారు. నీటిఎద్దడి ఉందా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గౌతాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు-మన బడి కింద నిర్మించిన భవనాలను పరిశీలించారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని విద్యార్థులు చెప్పారు. పాఠశాల వద్ద ఉన్న బోర్లలో సుద్దనీళ్లు వస్తున్నాయని, వాటర్ ప్లాంట్ కావాలని విద్యార్థులు కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అదేవిధంగా చెంగోల్ పాఠశాలను డీపీవో జయసుధ సందర్శించారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు.


గౌతాపూర్‌లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, పీఆర్ డీఈ వెంకట్‌రావు, మిషన్ భగీరథ డీఈ రమేష్, ఎంపీవో రతన్‌సింగ్, ఏఈలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 19: వరి ధాన్యం విక్రయించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దుద్యాల మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి రైతులు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు కొడంగల్‌లో క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకాధికారికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పరిశీలించి తగిన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాజ్‌ఖాన్‌పల్లి రైతులు, దుద్యాల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, రైతులు సురేందర్‌రెడ్డి, మల్లప్ప, సమరసింహారెడ్డి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అగ్నిప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

వికారాబాద్, ఏప్రిల్ 19 : పాఠశాలలు, కళాశాల్లో ఫైర్‌సేఫ్టీ పరికరాలు అమర్చుకుని అగ్నిప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ వెంకట రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని వేదిక్ పాఠశాలలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న వారికి బేసిక్ ఫైర్‌ఫైటింగ్ శిక్షణ ఇచ్చారు.


వేదిక్ పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదాం

తాండూరు, ఏప్రిల్ 19: ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు ముఖ్య కార్యకర్తల సమావేశంలో గురువారం మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో తాండూరు ప్రాంతానికి ఒరిగేదేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి గ్రామంలో రచ్చబండ వద్ద ఎండగడుతామని అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలపై పోస్టుకార్డు ఉద్యమం చేపడతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కులపై పోరాడిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పివైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజు గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న లక్ష్మారెడ్డిని గెలిపించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలి


ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న సుతారిగూడ వాసులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీని ఆదరించాలని మల్కాజ్‌గిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన గ్రామస్తులు ఈటల సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ మంసరాణి కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కీసర రూరల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపుఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు కౌకుంట్ల చంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు భవానినగర్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఈటల రాజేందర్ గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వేణు, నాయకులు జంగారెడ్డి, వెంకటేశ్వర్రావు, రవీందర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

డీకే.అరుణను గెలిపిద్దాం

కొడంగల్, ఏప్రిల్ 19: పాలమూర్ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణను భారీ మెజారిటీతో గెలిపిద్దామని గిరిజన సంఘం నాయకులు, బీజేపీ నాయకులు ధర్మనాయక్, రవీందర్‌నాయక్, సర్వేశ్ తదితరులు పిలుపునిచ్చారు. కొడంగల్‌లో శుక్రవారం వారు బీజేపీ గిరిజన మోర్చా మండలాల అధ్యక్షుడు, ఇన్‌చార్జిలు ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు రాజశేఖర్, సముద్రమ్మ, రాములు, రాథోడ్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


చేవెళ్ల: కౌకుంట్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 19 : నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, లోక్‌సభ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి ఏ. అనంత్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోనే దేశం మరింత ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మచ్చలేని నాయకుడని చెప్పారు. పార్టీలు మారుతూ అవినీతికి పాల్పడే నాయకులను ఓడించాలన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు కొండా నాందేవ్‌గౌడ్, నాయకులు నాగర్జున్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయసింహరెడ్డి, కుమార్‌గౌడ్, సారా కరణ్‌జీ, మాదవరావ్, సారా శివకుమార్‌జీ, బూషికేష్‌గౌడ్, దండు నర్సింలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ గెలవాలి

సరూర్‌నగర్, (ఆంధ్రజ్యోతి): దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ గెలవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఓటర్లు ఆదరించి ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. కొండాకు మద్దతుగా శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు మద్ది సబితారాజశేఖర్‌రెడ్డి, కీసరి హరినాథ్‌రెడ్డి, పసునూరి భిక్షపతిచారి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కె.సోమేశ్వర్, నాయకులు సూల ప్రభాకర్, యాదగిరియాదవ్, నాగరాజు, బుచ్చిరాములు, నగేశ్, జేడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

దోమ: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని సోదరి డాక్టర్ మీరా శుక్రవారం బొంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలంటే ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోరల అనంతయ్య, జిల్లా నాయకులు యాదయ్య, బొంపల్లి బూత్ అధ్యక్షుడు నర్సింహ, ఆంజనేయులు, రవీందర్, మల్లేశ్, హన్మంతు, మల్లయ్య, నర్సింహులు, మహేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని రామ్‌నాథ్ గూడుపల్లి, దుర్గం చెరువు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కమలం పువ్వు గుర్తుపై ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం నాయకులు రాఘునాథ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకట్, నగేశ్ పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ప్రచారం

కులకచర్ల: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబసభ్యులు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని అనంతసాగర్‌లో శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులు డాక్టర్ కల్పనారెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మహిపాల్ తదితరులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, పాశం నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, మండల కోషాధికారిగా మహిపాల్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దోమ:బొంపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న డాక్టర్ మీరా

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్:** గురుకుల పాఠశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తాండూరు మండలంలోని రాంపూర్ తండాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. రాంపూర్ తండాకు చెందిన తనూజ, అక్షితలు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను శుక్రవారం ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి నగరంలోని బీజేపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌ను కలిశారు. ఎంపీపీతో పాటు బీజేపీ నాయకుడు గొంగళ్ళ బాలేష్ ఉన్నారు.

● **కొడంగల్:** ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి కోరారు. కొడంగల్‌లో శుక్రవారం ఉపాధ్యాయుడు నర్సింహులు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష 5సంవత్సరాల మినహాయింపు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఉద్యోగులకు భవిష్యత్‌లో చక్కని పీఆర్సీ ఇప్పించే బాధ్యత తాము తీసుకుంటామని ఉపాధ్యాయులు పీఆర్‌టీయూను బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అమర్‌నాథ్, అబ్దుల్‌హక్ పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** ఎన్కతల గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరవింద్, ఎన్కతల గ్రామస్థులు బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేశం, బిచ్చయ్య, శ్రీనివాస్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 22న అంతాయిపల్లి సమీపంలో భారీ ఎత్తున బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి వెల్లడించారు. అంతాయిపల్లి సమీపంలో శుక్రవారం బహిరంగసభను నిర్వహించేందుకు డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, పార్టీ తదితర నాయకులు గ్రౌండ్ స్థలాన్ని సందర్శించి తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పట్నం సునీతమహేందర్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం సమీపంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో భారీ ఎత్తున బహిరంగసభను నిర్వహించనున్నారు. ఈ సభకు రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్నారని తెలిపారు.

● **తాండూరు:** తాండూరు మర్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని శుక్రవారం ఆర్పిఎల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మహిళా మండలి సాయంతో ఈ మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 45రోజుల పాటు మజ్జిగ కేంద్రం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు విజయ్ ప్రకాష్ సార్దా, మన్మోహన్ పాల్గొన్నారు.

● **పూడూరు:** రాకంచర్ల పెంటన్న ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని మన్నెగూడ గ్రౌండ్‌లో నేడు(శనివారం) జరిగే ఈ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథులుగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రాకంచర్ల పెంటన్నలు హాజరవుతారని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఎంట్రీ ఫీజు రూ.2వేలు చెల్లించి టోర్నమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ 9963684784, 8520933584 నెంబర్లకు సంప్రదించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు.

● **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ సాయినగర్ కాలనీలోని ఇంటినెంబర్ 7- 173/పిలో గల ఇంటిలో నిబంధనలకు విరుద్ధంగా కళాశాలను ఏర్పాటు చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు సంగీతం వీరబద్రయ్య, ఐలయ్య శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు.

● **పెద్దేముల్:** బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ కుమార్ పర్యటన విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు హరీష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మారెపల్లి తదితర గ్రామాల్లో రమేష్‌కుమార్ పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు.

● **వికారాబాద్:** జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లి సంగం లక్ష్మీబాయి గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25విద్యా సంవత్సరంలో బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గోపిశెట్టి రమణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టుల్లో బోధించేందుకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. భాషేతర ఉపాధ్యాయులు ఇంగ్లీష్ మీడియం వారై ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో విద్యార్హతతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత కలిగి ఉండాలని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు బోధించేందుకు ఫుల్ టైం అధ్యాపకులు కావాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూన్ 1వ తేదీ లోగా వికారాబాద్ ఎన్నేపల్లి బాలికల గురుకుల పాఠశాలలోని ప్రిన్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.